ఇంటింటికీ కొళాయి నీరు

• మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సోమల: త్వరలోనే ప్రతి ఇంటికీ కొళాయిల ద్వారా శుద్ధ జలం అందిస్తామని విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఆయన మాట్లాడుతూ, రూ.2800 కోట్లతో గండికోట రిజర్వాయర్ నుంచి పైపులైన్‌తో నీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గంలో ఆవులపల్లె రిజర్వాయర్ పూర్తయితే సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, పీలేరు మండలాలకు 24 గంటలు సాగు, తాగునీరు అందించేందుకు అవకాశాలున్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలో మూడు ప్రాజెక్టులు నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, అయితే దీనిని నారా చంద్రబాబుబాబు నాయుడు కుట్రపూరితంగా సుప్రీం కోర్టులో కేసు వేసి ఆ నిర్మాణాలను అడ్డుకున్నారని మండిపడ్డారు. ఆ కేసు గెలిచిన వెంటనే వేగంగా పనులు పూర్తి చేసి ప్రజలకు తాగు, సాగు నీరు అందిస్తామని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కరోనా సమయంలో కూడా ప్రజలకు అండగా నిలిచారని, ప్రపంచమంతా ఆర్థికంగా చితికినా ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలు మాత్రం నిలుపుదల చేయలేదని, ఆయన అండతోనే నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. ప్రజలందరూ మరోసారి ఆయనకు అండగా నిలవాలని కోరారు. అనంతరం కందూరులో స్వచ్ఛతా హీ సేవలో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రధానమైన గ్రీన్ అంబాసిడర్లను మంత్రి సన్మానించడంతోపాటు వారికి యూనిఫాం, పాదరక్షలు, ఆయిల్, సోపులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గంగాధరం, జేసీఎస్ కన్వీనర్ మంజునాథ, సర్పంచ్ మసూద్, నేతలు బెంగళూరు సాంబయ్య, నాగభూషణం రెడ్డి, రవీంద్రరెడ్డి, అమాస మోహన్, నాగేశ్వరరావు, మెకానిక్ బాషా, ప్రభాకర, సయ్యద్ బాషా, నిరంజన్ రెడ్డి, చంద్రశేఖర్ నాయుడు, వేముల హరినాథ, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.


కందూరులో షాదీమహల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన చిత్తూరు ఎంపీ


గ్రీన్ అంబాసిడర్లను సన్మానిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, చిత్రంలో ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్


పాదలగుంటపల్లెలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

క్లుప్తంగా

గుడి నిర్మాణానికి మంత్రి పెద్దిరెడ్డి విరాళం


ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న చైర్మన్ అలీమ్‌బాషా, కౌన్సిలర్ భారతి

పుంగనూరు: మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పట్టణంలోని ఎన్ఎస్.పేటలో శ్రీఆంజనేయస్వామి గుడి నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళం ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కౌన్సిలర్ భారతి ఆలయ నిర్వాహకులకు ఈ విరాళం అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ, వార్డు బాటలో ప్రజల విజ్ఞప్తిపై మంత్రి స్పందించి ఈ విరాళం ఇచ్చారని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పటాలమ్మ గుడికి రూ.2లక్షలు..


పాలెంపల్లెలో విరాళం అందజేస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి యాదవ్

పుంగనూరు: మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండలంలోని చిన్నకొండచెర్లలో పటాలమ్మ ఆలయానికి రూ.2 లక్షలు విరాళం ఇచ్చారు. శుక్రవారం ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి ఈ విరాళాన్ని గుడి నిర్వాహకులకు అందజేశారు. అలాగే మండలంలోని పాలెంపల్లెలో బాలికకు వైద్యం కోసం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. సచివాలయాల కన్వీనర్ చెంగారెడ్డి, సర్పంచ్ శంకరప్ప, పలువురు నేతలు పాల్గొన్నారు.

తూకాల్లో తేడా వస్తే కేసులు


తూనికల మెషిన్లను పరిశీలిస్తున్న రమాదేవి

రొంపిచెర్ల: నిత్యావసర సరుకుల కొలతలు, తూకాల్లో తేడాలు వస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తూనికలు–కొలత ల విభాగం పలమనేరు ఇన్‌స్పెక్టర్ రమాదేవి అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో చౌక దుకాణాల తుకాల మెషిన్లను పరిశీలించారు. అనంతరం 27 చౌక దుకాణాల యంత్రాలను పరిశీలించి తూకాల కొలతలను సరి చేశారు. డీటీ లోకేష్, చౌక దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

నిమజ్జనం

కుప్పం: వినాయక చవితి సందర్భంగా పట్టణంలో ఎన్‌టీఆర్ కాలనీలో వినూత్నంగా ఏర్పాటు చేసిన 5 రకాల వినాయకస్వామి ప్రతిమలను శుక్రవారం వీరప్పనాయన చెరువులో ప్రతి నిమజ్జనం చేశారు.

పూర్వ విద్యార్థుల వితరణ

పలమనేరు: తమ ఉన్నతికి బాటలు వేసిన స్కూలుకు పూర్వ విద్యార్థులు రూ.లక్ష విలువైన వాటర్ ప్యూరిఫయర్‌ను శుక్రవారం ఓఎల్ఎల్ పాఠశాలకు అందజేశారు. ఇదే పాఠశాలలో చదివి ప్రస్తుతం అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పని చేస్తున్న జై కిశోర్ ఈ వితరణ చేశారు. దీనిని హెచ్ఎం నిర్మలకు పూర్వ విద్యార్థులు శ్యాంసుందర్‌రాజు, కుమార్, ఫరూక్, బాలాజీ, కిరణ్ తదితరులు అందజేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఆస్తి నష్టం

పులిచెర్ల(కల్లూరు): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లో వస్తువులన్నీ దగ్ధమైన ఘటన కల్లూరులో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కల్లూరులో రాత్రి 7 గంటల సమయంలో విద్యుత్ ఆగి, ఆగి వచ్చింది. ఆ సమయంలో గ్రామానికి చెందిన చెందిన హేమాద్రి కుటుంబ సభ్యులతో కలసి ఇంటి బయట కూర్చున్నాడు. ఇంతలో ఒక్కసారిగా విద్యుత్ సరఫరా రావడంతో హేమాద్రి ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో నిప్పంటుకుని, ఇల్లంతా దట్టంగా పొగ కమ్ముకుంది. అగ్నిమాపక సిబ్బంది సాహసం చేసి, ఇంట్లోని సిలిండర్ మాత్రం బయటకు తెచ్చారు. అయితే అప్పటికే ఇంట్లో ఉన్న వంద గ్రాముల బంగారం, రూ.10 వేల నగదు, దుస్తులు, బీరువా, టీవీ, వాషింగ్ మిషన్ కాలి పోయాయి. సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు యజమాని హేమాద్రి తెలిపారు.

ఈరోజు

మున్సిపల్ సమావేశం

పుంగనూరు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం

పుంగనూరు: తన కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ సీతారామన్ తెలిపారు. .

కో–ఆపరేటివ్ సొసైటీ మహా జనసభ

పలమనేరు: పట్టణంలోని బాలాజి కో–ఆపరేటివ్ సూపర్‌బజార్ మహా జనసభ శనివారం సూపర్‌బజార్ రెండో అంతస్తులోని కార్యాలయంలో నిర్వహించనున్నట్టు సూపర్‌బజార్ అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్ తెలిపారు.

నియోజకవర్గ స్థాయి ఖో-ఖో పోటీల విజేతలు వీరే!


ఖో-ఖో పోటీల్లో విన్నర్స్‌గా నిలిచిన బాలికల జట్టు

పలమనేరు: నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఖో-ఖో పోటీలు బైరెడ్డిపల్లెలోని అగస్థి పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. అండర్–14 బాలురు విభాగంలో పాముగానిపల్లె, ముదరందొడ్డి, అండర్–14 బాలికల విభాగంలో పాముగానిపల్లె, కమ్మనపల్లె, అండర్–17 బాలుర విభాగంలో పాముగానిపల్లె, పత్తికొండ, అండర్–17 బాలికల విభాగంలో కమ్మనపల్లె, కొలమాసనపల్లె జట్లు విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచాయని ఎంఈఓ సాయిలీల తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, పలువురు ప్రజాప్రతినిధులు, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ తల్లి గంగమ్మ

వి.కోట: మండలంలోని గంధారమాకులపల్లెలో శుక్రవారం పెద్దమ్మ తల్లి గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి నుంచే ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. శుక్రవారం ఉదయం గ్రామస్తులు అమ్మవారికి పూజల అనంతరం అమ్మవారిని శిరస్సును గ్రామంలో ఊరేగించారు. ఇంటింటా అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద అన్నదానం చేశారు. జూనియర్ కళాశాల కమిటీ చైర్మన్ అమరనాథ్, ఎంపీటీసీ కమల్, నాయకులు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షులను నియమించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మండల పార్టీ అధ్యక్షుల వివరాలు ఇలా ఉన్నాయి.

పుంగనూరు నియోజకవర్గం

పుంగనూరు మున్సిపాలిటీ	జి.జయరాం
పుంగనూరు	చెంగారెడ్డి
చౌడేపల్లె	అంజిబాబు
సోమల	గంగాధరం
సదుం	రెడ్డెప్పరెడ్డి
రొంపిచెర్ల	ఆర్. ఇబ్రహీంఖాన్
పులిచెర్ల	సి.నాదమునిరెడ్డి

పలమనేరు నియోజకవర్గం

పలమనేరు	జాఫర్
పలమనేరు రూరల్	బాలాజీనాయుడు
గంగవరం	మోహన్‌రెడ్డి
పెద్దపంజాణి	బాగారెడ్డి
బైరెడ్డిపల్లె	రత్నం కేశవులు
వి.కోట	బాలగురునాథ్

కుప్పం నియోజకవర్గం

కుప్పం	సుధీర్
కుప్పం రూరల్	మురుగేష్
రామకుప్పం	బాబురెడ్డి
శాంతిపురం	బుల్లెట్ దండపాణి
గుడుపల్లె	రామకృష్ణ

ఘనంగా పౌర్ణమి పూజలు

రామకుప్పం: స్థానిక శ్రీఅన్నపూర్ణాంబ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి పూజలు ఘనంగా చేశారు. ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, విశిష్ట అలంకరణ అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వాహకులు, మహిళలు పౌర్ణమి దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించారు.

ప్రాజెక్టు పరిశీలన

సదుం: మండలంలో కొన్ని రోజులుగా విస్తారంగా వర్షం కురుస్తోంది. దీంతో పలు చెరువులు, కుంటల్లోకి వర్షపు నీరు చేరుతోంది. కంభంవారిపల్లె వద్ద నూతనంగా నిర్మిస్తున్న మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు నీరు వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టును జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు.

మోటార్ సైకిళ్లు ఢీ



రాధాక్రిష్ణ, గణపతి

గంగవరం: రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కథనం..పలమనేరు రూరల్ మండలం ముసలమడుగుకు చెందిన గణపతి(22), రాజ్‌కుమార్(20), బాలక్రిష్ణ(19) కలిసి ద్విచక్ర వాహనంలో పలమనేరు వైపు వెళ్తున్నారు. ఇదే దారిలో టి.వడ్డూరుకు చెందిన రాధాక్రిష్ణ(29) గంగవరం వైపు బైక్‌లో వచ్చాడు. సాయిబాబా ఆలయం సమీపంలోని జాతీయ రహదారిపై రెండు బైకులు ఢీకొన్నాయి. నలుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసు లు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో రాధాక్రిష్ణ, గణపతి పరిస్థితి విషమించడంతో వైద్యులు వారిని చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధే ధ్యేయం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని జవునపల్లె పంచాయతీలో రోడ్డు నిర్మాణానికి జెడ్పీ చైర్మన్ భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ, నక్కనపల్లె నుంచి కొత్తపల్లె, బైరిసంద్ర కర్ణాటక సరిహద్దు వరకు ఈ రోడ్డును రూ.77 లక్షల జెడ్పీ నిధులతో వేయనున్నట్టు చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లోనూ అభివృద్ధి పనులు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, ఎంపీపీటీసీ శివరంజని, సర్పంచ్ భారతమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు గిరి ధర్, శ్రీనాథ్, సురేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి

రొంపిచెర్ల: మండలంలోని జాండ్లవారిపల్లె గ్రామ పంచాయతీలో సబ్ స్టేషన్ నిర్మాణానికి జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.3.5 కోట్ల నిధులను మంజూరు చేయించారు. దీంతో ట్రాన్స్‌కో అధికారులు టెండర్ల ప్రక్రియ ముగించి పనులకు శ్రీకారం చుట్టారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ, పెద్దమల్లెల, జాండ్లవారిపల్లె గ్రామ పంచాయతీలలో లోఓల్టేజీ సమస్య నివారణకు సబ్ స్టేషన్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. 30 ఏళ్ల వరకు ఎలాంటి విద్యుత్ సమస్య ఉండదని పేర్కొన్నారు. త్వరలోనే చెంచెంరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీలో కూడా సబ్ స్టేషన్ పనులను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి, రామ నారాయణరెడ్డి, శ్రీనాధనాయుడు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు నాశనం


మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి

కుప్పం: కళాశాలలో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని కుప్పం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి హితవు పలికారు. శుక్రవారం కుప్పం జూనియర్ కళాశాల ప్రాంగణంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న చట్టాల్లో ర్యాగింగ్ కేసులపై శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. విద్యార్థులు మంచి భవిష్యత్తును ర్యాగింగ్‌తో నాశనం చేసుకోరాదన్నారు. కళాశాలలో స్నేహపూరిత వాతావరణం ఉండాలన్నారు. ర్యాగింగ్ వల్ల ద్వేషాలు పెరిగి తీవ్ర స్థాయికి దారి తీస్తాయని ఆమె హెచ్చరించారు. విద్యార్థులు కలసి మెలసి ఉండాలని, చదువుల్లో రాణించి మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుప్రియ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక



పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక శుక్రవారం నిర్వహించారు. ఇందులో 108మంది పాల్గొనగా వీరిలో 76మందిని 35వ ఆర్మీ బెటాలియన్ అధికారులు ఎంపిక చేశారు. రన్నింగ్, ఫిట్‌నెస్, కరెంట్ అఫైర్స్‌పై పరీక్ష నిర్వహించి ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు, వైస్ ప్రిన్సిపల్ విజయశేఖరం, ఎన్‌సీసీ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపికకు నిర్వహించిన పరుగు పందెం

ఎంపిక


పూజ

కుప్పం రూరల్: సీటీఎంలో శుక్రవారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీల్లో కుప్పం మండలం చందం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని పూజ సత్తా చాటి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు మార్కొండ నాయుడు చెప్పారు. అండర్–17 కేటగిరిలో ఎంపికైన పూజ అక్టోబర్‌లో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటుందని చెప్పారు. పూజకు శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు లోకనాథంను అభినందించారు.

మందుకొట్టి ఓవరాక్షన్ చేస్తే ఇంతే!


కోర్టు వద్ద నిందితుడితో పోలీసులు

పులిచెర్ల(కల్లూరు): పీకల్దాకా మద్యం సేవించి, నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ఓ మందుబాబు చివరకు జైలుకు వెళ్లాల్సి వచ్చింది. కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపిన వివరాలు.. కల్లూరులోని ఎగువవీధికి చెందిన రెడ్డి అన్సర్(40) పూటుగా మద్యం సేవించి నాలుగు రోడ్లలో వచ్చిపోయే వాహనాలను అడ్డుకోవడంతో పాటు ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నాడనే సమాచారం అందడంతో పోలీసులు అతడిని రెండు మూడు పర్యాయాలు హెచ్చరించారు. అక్కడి నుంచి దూరంగా వదిలేశారు. అయిననూ అతడి తీరు మారలేదు. మళ్లీ నాలుగు రోడ్ల కూడలి వద్దకు చేరి మద్యం మత్తులో జనాలపై చిందులేయసాగాడు. మూడు రోజులుగా ఇతే తంతు. దీంతో సహనం నశించిన పోలీసులు అతడిపై న్యూసెన్స్ కేసు నమోదు చేశారు. శుక్రవారం పాకాల మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచడంతో అతడికి న్యాయమూర్తి ఏడు రోజులు జైలుశిక్ష విధించారని ఎస్ఐ చెప్పారు.

నేటి నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు



జగనన్న ఆరోగ్య సురక్ష లోగో

పలమనేరు: పలమనేరులో శనివారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక కాకాతోపు సచివాలయానికి సంబంధించి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నామని, అలాగే 7వ తేది ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్టు తెలియజేశారు. మండల, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది సమన్వయంతో ఈ శిబిరాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గంగవరం మండలంలో..

గంగవరం: మండలంలో శనివారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. 30న చిన్నూరు గ్రామ సచివాలయం, 3న గుండుగల్లు, 4న మారేడుపల్లె, 5న దండపల్లె జెడ్పీ హైస్కూల్, 6న కలగటూరు, 10న గండ్రాజుపల్లె జెడ్పీ హైస్కూల్, 11న కల్లుపల్లె, 12న పెద్దఉగిణి కమ్యూనిటీ హాల్, 13న కీలపట్ల, 16న జీడిమాకులపల్లి ప్రాథమిక పాఠశాల, 17న కొత్తపల్లె, 18న కీలపల్లె, 19న మేలుమాయి సచివాలయం, 20న మామడుగు జెడ్పీ హైస్కూల్, 25న తాళ్లపల్లె, 30న పసుపత్తూరులో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలియజేశారు. ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు శిబిరాలలో వైద్యపరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


సదుం: తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డికి రక్తపోటు పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది


పెద్దపంజాణి : ముత్తుకూరులో..

పెద్దపంజాణి మండలంలో..

పెద్దపంజాణి: ఈ నెల 30 నుంచి అక్టోబర్ 24 వరకు గ్రామాల్లో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాలపై ప్రజలకు ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పిస్తున్నారు. శిబిరానికి వచ్చే వారికి ఇళ్ల వద్దనే టోకెన్లు ఇస్తున్నారు.

నేడు రాజుపల్లె వైద్య శిబిరం

పెద్దపంజాణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాజుపల్లె జెడ్పీ హైస్కూలులో శనివారం వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి మురళీకృష్ణ తెలిపారు. ఇప్పటికే సచివాలయ పరిధిలో ఇంటింటా సర్వే పూర్తి చేసి 600 టోకెన్లు అందజేసినట్లు చెప్పారు. ప్రత్యేక వైద్య శిబిరంలో వైద్య నిపుణులు రోగులకు పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలో రాగానిపల్లె రోడ్డులోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. అలాగే అక్టోబర్ 4న ఈస్ట్‌పేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహిస్తామన్నారు. ఇప్పటి వరకు ట్రీట్‌మెంట్ నిమిత్తం 1,140 మంది పేర్లు నమోదు చేసుకున్నారని, ప్రజలు తమ ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇచ్చి, శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సదుం మండలంలో..

సదుం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఎల్లప్ప కోరారు. జగనన్న సురక్షపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాలలో సర్వే చేసి ప్రజలకు పరీక్షలు నిర్వహించారని, శనివారం సదుం–1 సచివాలయ పరిధిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎంపీడీఓ వరప్రసాద్, డాక్టరు గిరీష, ఎంఎల్‌ఓ బావాజి తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల మండలంలో..

రొంపిచెర్ల: ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. శనివారం గానుగచింత, 3వ తేది బొమ్మయ్యగారిపల్లె, 4న పెద్దమల్లెల, 5న చిచ్చిలివారిపల్లె, 6న మోటుమల్లెల, 7న బండకిందపల్లె, 9న రొంపిచెర్ల గ్రామ సచివాలయల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తామన్నారు. వైద్యాధికారులు దినేష్ కుమార్ నాయక్, రిజ్వాన్ రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేస్తారని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తంబళ్లపల్లె ఎమ్మెల్యేకు వైద్య పరీక్షలు

సదుం : మండలంలోని ఎర్రాతివారిపల్లెలో నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వేలో వైద్య సిబ్బంది తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డికి పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా శ్రీకారం చుట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నీలకంఠ, సీహెచ్ఓ రషీద్, ఏఎన్ఎం సత్తాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోస్టాండ్ ప్రారంభం


ఆటోస్టాండ్ ప్రారంభోత్సవంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి

సదుం: స్థానిక బస్టాండు సమీపంలో శ్రీవేంకటేశ్వర ఆటోస్టాండును జెడ్పీటీసీ సభ్యుడు సోమ శేఖర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు ఆయన చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డెప్ప రెడ్డి, చాంద్‌బాషా, మునిరామయ్య, చలపతి, రియాజ్, శీన, సైపుల్లా పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ


పారిశుధ్యంపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న టీచర్లు

పులిచెర్ల(కల్లూరు): పారిశుధ్యం పాటిద్దాం..అందరూ ఆరోగ్యంగా ఉందా..అనే నినాదంతో శుక్రవారం కల్లూరు హైస్కూలు విద్యార్థులు పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్య కార్మికులను గౌరవించాలని హెచ్ఎం శ్రీవాణి కోరారు. అందరూ ఆరోగ్యంగా ఉంటే ఎలాంటి సమస్యలూ దరిచేరవన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటసిద్దులు, రాజశేఖర్, రాజేంద్ర,ప్రకాష్, విమల, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.